క్లుప్తంగా

శరవేగంగా తారురోడ్డు పనులు


పనులను పర్యవేక్షిస్తున్న మున్సిపల్ వైస్ చైర్మన్ వేముల జయరామిరెడ్డి

ధర్మవరం: పట్టణంలోని శాంతినగర్ మున్సిపల్ కార్యాలయం పక్కన 60 అడుగుల రోడ్డులో తారురోడ్డు పనులు శరవేగంగా సాగుతున్నాయి. గురువారం మున్సిపల్ వైస్ చైర్మన్ వేముల జయరామిరెడ్డి రోడ్డు పనులను పర్యవేక్షించారు. పనులను నాణ్యతగా చేపట్టాలని అధికారులకు సూచించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

తనకల్లు: మండల పరిధిలోని కొక్కంటి క్రాస్‌లో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఫాజిల్ అనే వ్యక్తికి గాయాలయ్యాయి. వివరాలు.. ఫాజిల్ ఐచర్ వాహనానికి డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. ఐచర్ వాహనాన్ని ఆపి రోడ్డు దాటుతుండా ఎదురుగా వచ్చిన ద్విచక్ర వాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో ఫాజిల్ కాలికు బలమైన గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు అతడ్ని చికిత్స కోసం 108 వాహనంలో తనకల్లు ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

జర్నలిస్టు కాలనీలో చోరీ


దొంగలు పగులగొట్టిన బీరువాలు

ధర్మవరం అర్బన్: పట్టణంలోని రేగాటిపల్లి రోడ్డు సమీపంలో ఉన్న జర్నలిస్టు కాలనీలో గురువారం పట్టపగలే చోరీ జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. జర్నలిస్టు కాలనీలో నివసిస్తున్న మారుతిప్రసాద్ కుటుంబ సభ్యులు ఉదయం పని నిమిత్తం వేరే గ్రామానికి వెళ్లారు. ఇదే అదునుగా భావించిన దొంగలు మెటికల మార్గాన లోపలికి ప్రవేశించారు. ఇంట్లోని బీరువాలను పగలకొట్టారు. బీరువాలో డబ్బు, నగదు లేకపోవడంతో వెనక్కి వెళ్లిపోయారు. బాధితుడు మారుతి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దొంగల కోసం గాలిస్తున్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి చేయాలి


మాట్లాడుతున్న ఎంపీపీ సునీతాబాయి

నల్లమాడ: అధికారులు, సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ఎంపీపీ దుంగావత్ సునీతాబాయి సూచించారు. గురువారం మండల పరిషత్ కార్యాలయ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సచివాలయ సిబ్బందితో కలిసి అధికారులు తరచూ గ్రామాల్లో పర్యటించి ప్రజా సమస్యలు తెలుసుకోవాలన్నారు. సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించాలన్నారు. ఇంకా ఏవైనా సమస్యలుంటే తమ దృష్టికి తీసుకొస్తే పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. వైస్ ఎంపీపీ కే.సూర్యనారాయణ మాట్లాడుతూ.. ప్రస్తుతం జరుగుతున్న పక్కాగృహాల నిర్మాణం, ఈ–క్రాప్ బుకింగ్, ఆధార్ అప్‌డేట్‌పై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. ఎంపీడీఓ కొండన్న పాల్గొన్నారు.

సానేవారిపల్లిలో 'పొలం బడి'


మాట్లాడుతున్న వ్యవసాయాధికారులు

ముదిగుబ్బ: మండల పరిధిలోని సానేవారిపల్లిలో గురువారం పొలం బడి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ పొలం బడి కార్యక్రమానికి డీఆర్‌సీ ఏడీఏ సనావుల్లా, కదిరి ఏడీఏ సత్యనారాయణ, ఏడీఏ పీపీ విద్యావతి, ఏఓ లక్ష్మినరసింహులు హాజరయ్యారు. ఈ సందర్భంగా రైతులతో సమావేశం నిర్వహించారు. సూచనలు, సలహాలు తెలియజేశారు. ప్రతి వారం ఏయే విషయాలు నేర్చుకున్నారో రైతులను అడిగి తెలుసుకున్నారు. అలాగే పొలంబడి ప్లాట్లలో అమర్చిన లింగాకర్షక బుట్టలు, పక్షి స్థావరాలు తదితర వాటిపై రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏఈఓ షరీఫ్ పాల్గొన్నారు.

గంగమ్మ ఆలయ నిర్మాణ కమిటీ ఎన్నిక

తనకల్లు: రజక సంఘం నాయకుల ఆధ్వర్యంలో స్థానికంగా నిర్మించనున్న గంగమ్మ ఆలయం కమిటీని గురువారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కమిటీ అధ్యక్షుడిగా డీ.గంగాధర్, గౌరవ అధ్యక్షుడిగా అంజన్‌కుమార్, ఉపాధ్యక్షులుగా నారాయణ, శ్రీనివాసులు, ప్రధాన కార్యదర్శులుగా పి.మల్లికార్జున, శ్రీరాములు, హరినాథ్, కోశాధికారి ఆంజినేయులు, సభ్యులుగా అనిల్, వెంకటప్పను ఎన్నుకున్నారు.


పుట్టపర్తి అర్బన్: పెదపల్లి బోయ వీధిలో వినాయకుడి ఊరేగింపు


పుట్టపర్తి అర్బన్: పెదపల్లిలో యువత సందడి


తాడిమర్రిలో వినాయక విగ్రహ ఊరేగింపు

వెళ్లిరా.. గణపయ్యా

- భక్తిశ్రద్ధలతో గణేష్ నిమజ్జనం

ధర్మవరం, కదిరి, పుట్టపర్తి నియోజకవర్గాల్లో గురువారం వినాయక నిమజ్జన సందడి నెలకొంది. ఎన్‌పీకుంట, చీమలచెరువుపల్లిలో కొలువుదీర్చిన వినాయక ప్రతిమలను ట్రాక్టర్లలో ఊరేగించారు. మండపాల వద్ద భజనలు, భక్తిపాటలతో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. పలు చోట్ల ఉట్టికొట్టే కార్యక్రమాన్ని ఏర్పాటు చేసి, విజేతలకు నగదు బహుమతులు అందజేశారు. యువత కోలాటం, చెక్కభజన ఆడుతూ.. జై బోలో గణేష్ మహరాజ్‌కి జై అంటూ రంగులు చల్లుకున్నారు. విగ్రహాలను ఊరేగింపుగా తీసుకెళ్లి వెలిగల్లు జలాశయంలో నిమజ్జనం చేశారు. చీమలచెరువుపల్లిలో లడ్డూ వేలం నిర్వహించారు. సుబ్బారెడ్డి రూ.31,500, ఎన్.పీ.కుంట పెడబల్లి రోడ్డులో దండే వెంకటశివ రూ.25,000 వేలం పాడి లడ్డూ కైవసం చేసుకున్నారు. అలాగే తాడిమర్రి కునుకుంట్ల, పెద్దకోట్ల, ఎం.అగ్రహారం, పిన్నదరి, ఏకపాదంపల్లి తదితర గ్రామాల్లో వినాయకులను నిమజ్జనం చేశారు. ధర్మవరం పట్టణంలోని పోతులనాగేపల్లి జగనన్న కాలనీలో లడ్డూ వేలంపాట జోరుగా సాగింది. సిమెంట్ అంగడి ఓంనాథ్ దంపతులు లడ్డూను రూ.10,116లకు దక్కించుకున్నారు. ధర్మవరం పట్టణంలోని ప్రియాంకనగర్‌లో లడ్డూ వేలం పాట నిర్వహించారు. 27వ వార్డు కౌన్సిలర్ డోలా ఓబుళమ్మ, వైఎస్సార్‌సీపీ వార్డు ఇన్‌చార్జ్ డోలా రాజారెడ్డి రూ.13,200లకు లడ్డూ దక్కించుకున్నారు. అనంతరం లడ్డూను భక్తులకు పంచిపెట్టారు. పుట్టపర్తి మండలంలోని పెడపల్లి, పెద్దతండా, నిడిమామిడి, చెర్లోపల్లి, కొట్లపల్లి, వెంగళమ్మ చెరువు, వెంకటగారిపల్లి, జగరాజుపల్లి, కప్పలబండ గ్రామాల్లో గణపయ్యలను గంగ ఒడికి చేర్చారు. ప్రధాన వీధుల్లో విగ్రహాలను ఊరేగించి చిత్రావతి నది, ఆయా గ్రామాల్లోని చెరువులు, కుంటల్లో నిమజ్జనం చేశారు. అమడగూరు మండలంలోని వివిధ గ్రామాల్లో గణేష్ లడ్డూను వేలం వేశారు. గంగిరెడ్డిపల్లిలో 10 కేజీల లడ్డూ అత్యధికంగా రూ.57 వేలు పలికింది. గ్రామానికి చెందిన కొమ్మిరి శ్రీనివాసులు లడ్డూను దక్కించుకున్నారు. అలాగే రెడ్డివారిపల్లిలో రూ.41 వేలు, బలకవారిపల్లిలో రూ.6,100, శీతిరెడ్డిపల్లిలో రూ.5 వేలు పలికాయి. గంగిరెడ్డిపల్లిలో భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. కదిరిలో ఎర్రకోట వినాయకుడి 234 కేజీల లడ్డూను రూ.1,13,000 లకు అడపాల వీధికి చెందిన దేరంగుల సూరి, లీలావతి దంపతులు దక్కించుకున్నారు. – సాక్షి నెట్‌వర్క్:


ధర్మవరం: లడ్డూ దక్కించుకున్న 27వ వార్డు కౌన్సిలర్ ఓబుళమ్మ, ఇన్‌చార్జ్ డోలా రాజారెడ్డి


ఎన్‌పీకుంట: ఉట్టి కొడుతున్న యువకులు


ధర్మవరం అర్బన్: విగ్రహ ఊరేగింపులో డ్యాన్స్ చేస్తున్న యువత


ధర్మవరం రూరల్: లడ్డూ వేలంపాట నిర్వహిస్తున్న దృశ్యం


ధర్మవరం అర్బన్: వినాయక విగ్రహాలను నిమజ్జనానికి తరలిస్తున్న భక్తులు


ఎన్‌పీకుంట: నిమజ్జనానికి తరలిన గణనాథుడు

24న జిల్లా స్థాయి యోగా పోటీలు


కరపత్రాలు విడుదల చేస్తున్న దృశ్యం

ధర్మవరం అర్బన్: జిల్లా స్థాయి యోగా పోటీల్లో యోగా సాధకులు పాల్గొని విజయవంతం చేయాలని యోగా అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు గాజుల సోమేశ్వర్‌రెడ్డి కోరారు. పట్టణంలోని సాంస్కృతిక మండలిలో గురువారం యోగా పోటీలకు సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈనెల 24వ తేదీన అనంతపురంలోని రెవెన్యూ కాలనీలో ఉన్న రామాలయం ప్రాంగణంలో జిల్లాస్థాయి యోగా పోటీలు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ పోటీల్లో 9 సంవత్సరాల నుంచి 55 సంవత్సరాల వయసు ఉన్నవారు పాల్గొనవచ్చని తెలిపారు. కార్యక్రమంలో యోగా అసోసియేషన్ కార్యదర్శి సుబ్బరాయుడు, సాంస్కృతిక మండలి వ్యవస్థాపకుడు సత్రసాల ప్రసన్నకుమార్, మాజీ టౌన్ బ్యాంక్ అధ్యక్షుడు సోలిగాళ్ల వెంకటేశులు, యోగా ఆర్గనైజర్ నరసింహులు, ఈశ్వరయ్య, సాయిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

తప్పిన పెను ప్రమాదం


కూలిపోయిన వేపలకుంట రామస్వామి ఆలయం గోడ

గాండ్లపెంట: సోమయాజులపల్లి పంచాయతీ వేపలకుంట గ్రామంలో బుధవారం అర్ధరాత్రి పెను ప్రమాదం తప్పింది. రామస్వామి ఆలయం పైకప్పు భాగంలో నిర్మించిన గోడ కూలింది. ఆ సమయంలో అక్కడ ఎవ్వరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పిందని గ్రామస్తులు తెలిపారు. గ్రామస్తులు తెలిపిన మేరకు వివరాలిలా ఉన్నాయి.. వినాయక చవితి పండుగ సందర్భంగా వినాయక విగ్రహాన్ని ఆలయ ఆవరణలో ప్రతిష్టించారు. మూడు రోజుల పూజల అనంతరం బుధవారం మధ్యాహ్నం గ్రామస్తులంతా కలసి వినాయక నిమజ్జనాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. నిమజ్జనం రాత్రి 10 గంటలకు పూర్తి కాగా.. గ్రామ ఆలయ ఆవరణలోనే గంటపాటు గడిపారు. అనంతరం అందరూ ఇళ్లకు వెళ్లిపోయారు. అయితే అర్ధరాత్రి ఉన్నపళంగా పెద్ద శబ్దం వచ్చింది. గమనించిన పలువురు ఆలయాన్ని పరిశీలించారు. ఆలయ పైకప్పు చేపట్టు గోడ కూలింది. గోడపై అమర్చిన విగ్రహాలు సైతం ధ్వంసం అయ్యాయి. కాగా ఆ రోజు రాత్రి 20 నుంచి 30 మంది దాకా ఆలయంలోనే ఉన్నారని.. అదృష్టవశాత్తూ ఆ సమయంలో ప్రమాదం జరగలేదని గ్రామస్తులు తెలిపారు.

పండ్ల తోటల సాగుపై అవగాహన కల్పించండి


మాట్లాడుతున్న ఎంపీడీఓ శకుంతల

నల్లచెరువు: స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో గురువారం మండలంలో జరుగుతున్న ఉపాధి పనులపై ఎంపీడీఓ శకుంతల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రభుత్వ కార్యాలయాల వద్ద జరుగుతున్న (రూఫ్ వాటర్ హార్వెస్టింగ్ స్ట్రక్చర్) నీటిని నిల్వ చేయు కుంటల పనులను నిర్ణీత సమయంలో పూర్తి చేయాలని సిబ్బందికి సూచించారు. అలాగే పండ్ల తోటల పెంపకంపై గ్రామాల్లో రైతులకు అవగాహన కల్పించాలన్నారు. ఉపాధి కూలీల బ్యాంకు ఖాతాలకు ఆధార్‌కార్డు అనుసంధానం చేసే ప్రక్రియను వారం రోజుల్లో పూర్తి చేయాలని ఆదేశించారు. అనంతరం అల్లుగుండు సచివాలయంలో జగనన్న ఆరోగ్య సురక్ష, జగనన్న పాలవెల్లువ సర్వేపై వలంటీర్లు, సచివాలయ సిబ్బందితో రివ్యూ నిర్వహించారు.

పరిటాల కుటుంబం చేసిందేమీ లేదు

రామగిరి: రాప్తాడు నియోజకవర్గానికి పరిటాల కుటుంబం చేసిందేమీలేదని ఎంపీపీ కె్రెన్న, సర్పంచు సరస్వతి, వైఎస్సార్‌సీపీ నాయకులు దాసరి మోహన్‌బాబు, రాజేష్ విమర్శించారు. గురువారం స్కిల్‌స్కాంలో టీడీపీ అధినేత చంద్రబాబును రిమాండ్‌కు తరలించడాన్ని తప్పుపడుతూ పేరూరు గ్రామంలో పరిటాల సునీత ఆధ్వర్యంలో మహిళలు దీక్ష చేపట్టారు. దీంతో వైఎస్సార్‌సీపీ మండల నాయకులు విలేకరులతో మాట్లాడారు. పరిటాల కుటుంబ సభ్యులు మంత్రులుగా, ఎమ్మెల్యేలుగా పదవులు అనుభవించినా ఈ ప్రాంతానికి వారు చేసిందేమీలేదన్నారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో పేరూరు డ్యాం నుంచి లక్షల మెట్రిక్ టన్నుల ఇసుకను అక్రమంగా బెంగళూరు, ఇతర ప్రాంతాలకు తరలించి, సొమ్ము చేసుకున్నారన్నారు. ఎన్నికల సమయంలో పేరూరుడ్యాంకు నీరిస్తామని ఉచితహామీతో ఓట్లు దండుకొంటున్నారేతప్ప బీసీ, ఎస్సీ, మైనార్టీలతోపాటు మహిళలకు చేసిందేమీలేదన్నారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి రాగానే పేరూరు డ్యాంకు కృష్ణా జలాలు తీసుకొచ్చినట్లు తెలిపారు. ముత్యాలమ్మ ఆలయాన్ని దేవదాయశాఖ పరిధిలోకి తెచ్చినట్లు తెలిపారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి ఆధ్వర్యంలో ఫ్యాక్షన్ తోపాటు కరువుతో కొట్టుమిట్టాడుతున్న ఈప్రాంతాన్ని సస్యశ్యామలం చేస్తున్నట్లు తెలిపారు.

'రేషన్' సకాలంలో అందించాలి

గాండ్లపెంట: స్థానిక గ్రామ సచివాలయంలో గురువారం ఆహార సలహా సంఘం సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వీఆర్వో రమణ మాట్లాడుతూ.. గ్రామాల్లో చౌకధాన్యాన్ని సకాలంలో లబ్ధిదారులకు అందించాలన్నారు. పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలకు నాణ్యమైన పౌష్టికాహారం అందించాలని సూచించారు. ఎటువంటి ఫిర్యాదులు అందకుండా చూసుకోవాలని తెలిపారు. ఏవైనా సమస్యలుంటే తమ దృష్టికి తీసుకురావాలని పేర్కొన్నారు.

జిల్లా స్థాయిలో రాణించిన విభిన్న ప్రతిభావంతులు


బహుమతి అందుకుంటున్న విద్యార్థి

కనగానపల్లి: మండలానికి చెందిన విభిన్న ప్రతిభావంతులు జిల్లా స్థాయిలో జరిగిన ఆటల పోటీల్లో రాణించినట్లు ఐఈఆర్‌టీ జగదీష్ తెలిపారు. సత్యసాయి జిల్లా పరిధిలోని పలు పాఠశాలల్లో చదువుతున్న విభిన్న ప్రతిభావంతులకు గురువారం కొత్తచెరువులో ఆటల పోటీలు నిర్వహించారు. ఇందులో కనగానపల్లి జిల్లా పరిషత్ పాఠశాలకు చెందిన విద్యార్థులు ప్రవణ్ కుమార్ లాంగ్‌జంప్‌లో మొదటి స్థానం, బేస్‌బాల్ పోటీల్లో మూడో స్థానంలో నిలిచాడు. బేస్‌బాల్ పోటీలో ప్రవీణ అనే విద్యార్థిని మొదటి స్థానంలో నిలిచింది. వీరిని జిల్లా స్థాయి అధికారులు అభినందించి బహుమతులు అందించారు.

షార్ట్‌సర్క్యూట్‌తో తీవ్ర నష్టం

అమడగూరు: ఓడీచెరువు మండలం మామిళ్లకుంట్లపల్లిలో ఎద్దుల శంకర్‌రెడ్డి ఇంట్లో బుధవారం అర్ధరాత్రి విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో తీవ్ర నష్టం వాటిల్లింది. కంప్యూటర్, ల్యాప్‌టాప్, ప్రింటర్, కొరియర్ కంపెనీకి చెందిన డాక్యుమెంట్లు, పార్శిల్స్‌తో పాటుగా ఇంట్లోని వివిధ రకాల వస్తువులు కాలి బూడిదైనట్లు బాధితుడు తెలిపాడు.

ఎంపీ మిథున్‌రెడ్డిని కలసిన బత్తల హరిప్రసాద్


ఎంపీ మిథున్‌రెడ్డితో మాట్లాడుతున్న బత్తల హరిప్రసాద్

కదిరి అర్బన్: ఎంపీ మిథున్‌రెడ్డిని గురువారం ఢిల్లీలోని ఆయన నివాసంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి బత్తల హరిప్రసాద్, బీసీ సంక్షేమ సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి డా.బత్తల వెంకటరమణ మర్యాదపూర్వకంగా కలిశారు. పార్టీ బలోపేతానికి కృషి చేయాలని ఎంపీ సూచించారు.

టార్గెట్ బాల్ ఇంటర్ డిస్ట్రిక్ట్ సబ్ జూనియర్స్ పోటీల్లో సత్తా


విద్యార్థులను అభినందిస్తున్న యశోద పాఠశాల నిర్వాహకులు

ధర్మవరం: టార్గెట్ బాల్ ఇంటర్ డిస్ట్రిక్ట్ సబ్ జూనియర్స్ పోటీల్లో తమ పాఠశాల విద్యార్థులు సత్తా చాటారని యశోద పాఠశాల డైరెక్టర్ పృథ్వీరాజ్ తెలిపారు. గురువారం పాఠశాలలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈనెల 17న జమ్ములమడుగులోని గిద్దలూరులో జరిగిన టార్గెట్ బాల్ ఇంటర్ డిస్ట్రిక్ట్ సబ్ జూనియర్స్ పోటీల్లో పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచి మూడో స్థానం దక్కించుకున్నారని తెలిపారు. విద్యార్థులను డిస్ట్రిక్ట్ టార్గెట్ బాల్ కార్యదర్శి సుధారాణి, పాఠశాల ప్రిన్సిపాల్ అనూప్, పీడీ అశోక్, మణికంఠ, జ్యోతి అభినందించారు.

తక్కువ ధరకే పురుగు మందులు


మాట్లాడుతున్న వ్యవసాయాధికారులు

ముదిగుబ్బ: మండల కేంద్రంలో గురువారం శ్రీ లక్ష్మీనరసింహస్వామి ముదిగుబ్బ నాఫెడ్ రైతు ఉత్పత్తిదారుల సంఘం ద్వితీయ వార్షికోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఈ కార్యక్రమానికి ఏడీఏ సత్యనారాయణ, డీఆర్‌సీ ఏడీఏలు సనావుల్లా, విద్యావతి, ఏఓ లక్ష్మీనరసింహులు హాజరయ్యారు. ఈ సందర్భంగా రైతులకు అందుబాటులో ఉన్న ఎరువులు, పురుగు మందులపై వివరించారు. పురుగు మందులు ప్రవేటు ఎరువుల దుకాణాలలో కన్నా తక్కువ ధరతో రైతు ఉత్పత్తి సంఘం తరఫున రైతులకు విక్రయించడం జరుగుతుందన్నారు. అలాగే నాఫెడ్ వారి సహకారంతో ఈ సంఘం ద్వారా రైతులకు అమ్మడం జరుగుతుందన్నారు.

ఘనంగా గురజాడ జయంతి

కదిరి అర్బన్: స్థానిక ఎస్టీఎస్ఎన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం మహాకవి గురజాడ అప్పారావు జయంతిని ఘనంగా నిర్వహించారు. తెలుగు సాహిత్యాన్ని సుసంపన్నం చేసిన గొప్ప అభ్యుదయ కవితా పితామహుడు గురజాడ అని పలువురు వక్తలు కొనియాడారు. కన్యాశుల్కం నాటకంతో ఆనాటి సమాజంలో మార్పు తీసుకుని వచ్చారని తెలిపారు. అనంతరం విశ్రాంత తెలుగు ఉపాధ్యాయుడు చౌడ వెంకటరమణను సన్మానించారు. కార్యక్రమంలో అధ్యాపకులు ఆదినారాయణ, హైదర్‌వలీ, నారాయణ స్వామి, రఘునాథ్‌రెడ్డి, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత

నల్లచెరువు: మండల పరిధిలోని గొల్లపల్లికి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త నీలకంఠ (35) అనారోగ్యంతో బుధవారం రాత్రి మృతి చెందాడు. స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు కల్లిపల్లి శ్రీనివాసులు, వై.శ్రీధర్‌రెడ్డి ద్వారా విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ సీఈసీ సభ్యుడు పూల శ్రీనివాస రెడ్డి గురువారం గ్రామానికి విచ్చేశారు. నీలకంఠ మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి తక్షణ సాయంగా రూ.10 వేల నగదును మృతుడి కుటుంబ సభ్యులకు అందజేశారు.

చికిత్స పొందుతూ విద్యార్థిని మృతి

బత్తలపల్లి: మండలంలోని డి.చెర్లోపల్లి గ్రామానికి చెందిన బెస్త సుధా వెంకటరమణ కుమార్తె సుధా స్రవంతి (16) ఈనెల 12వ తేదీన ఇంట్లో ఎవ్వరూ లేని సమయంలో గడ్డి మందు సేవించి ఆత్మహత్యాయత్నం చేసిన విషయం తెలిసిందే. కుటుంబ సభ్యులు ఆమెను అనంతపురం ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లారు. మెరుగైన వైద్యం కోసం ప్రవేట్ ఆసుపత్రికి తరలించగా.. అక్కడ చికిత్స పొందుతూ గురువారం మృతి చెందింది. కాగా.. జూలై నెలలో విడుదలైన పదో తరగతి సప్లిమెంటరీలో సుధా స్రవంతి ఫెయిల్ అయ్యింది. మనస్తాపంతోనే స్రవంతి ఆత్మహత్య చేసుకుందని కుటుంబ సభ్యులు తెలిపారు. విద్యార్థిని తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు.

ఫీల్డ్ అసిస్టెంట్ల సమస్యలు పరిష్కరించాలి

ధర్మవరం రూరల్: ఉపాధి హామీ పథకంలో పని చేస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్ల సమస్యలను పరిష్కరించాలని ఫీల్డ్ అసిస్టెంట్ల యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి.నరసింహులు డిమాండ్ చేశారు. గురువారం వివిధ డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని ఎంపీడీఓ సౌజన్యకుమారికి అందజేశారు. ఫీల్డ్ అసిస్టెంట్లకు ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. అదే విధంగా కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలన్నారు. అలాగే హెల్త్ కార్డులను పంపిణీ చేయాలని కోరారు.

నేడు విద్యుత్ అంతరాయం

కదిరి టౌన్: వినాయక విగ్రహాల నిమజ్జనం సందర్భంగా శుక్రవారం పట్టణంలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ట్రాన్స్‌కో ఏఈ చెన్నకృష్ణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కాలేజ్ సర్కిల్, మారుతినగర్, జొన్న విధి, నల్లగుట్ట, ఎంజీ రోడ్డు, పూల బజారు, తేరు బజారు, టెంపుల్ బజారు, మగ్గాల క్వార్టర్స్, పార్థసారథి కాలనీలో విద్యుత్ సరఫరా ఉండదన్నారు. నిమజ్జనం పూర్తి అయిన తర్వాత విద్యుత్ సరఫరాను పునరుద్ధరిస్తామన్నారు.

అంగన్‌వాడీ ఆయా పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

చెన్నేకొత్తపల్లి: ఐసీడీఎస్ సెక్టార్ పరిధిలోని రామగిరి, చెన్నేకొత్తపల్లి మండలాల్లో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ ఆయా (హెల్పర్) పోస్టులకు అర్హులు ఈ నెల 29లోపు దరఖాస్తు చేసుకోవాలని సీడీపీఓ కవితాదేవి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. మొత్తం 8 పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. రామగిరి మండలంలో గంగంపల్లి (ఎస్సీ), పోలేపల్లి–1 (ఓసీ), పోలేపల్లి–2 (బీసీ– ఈ), రామగిరి –2 (బీసీ–బీ), చెన్నేకొత్తపల్లి–1 (ఓసీ) మేడాపురం –4 (ఓసీ), ఉప్పరవాండ్ల కొట్టాల (ఓసీ)గా రిజర్వేషన్లు ప్రభుత్వం కేటాయించిందన్నారు. మహిళలు 10వ తరగతి పాసై 21 ఏళ్ల నుంచి 35 ఏళ్లలోపు ఉన్నవారు అర్హులన్నారు. దరఖాస్తులను చెన్నేకొత్తపల్లి సీడీపీఓ కార్యాలయంలో అందజేయాలన్నారు.

తనకల్లు మండలంలో..

తనకల్లు: మండల పరిధిలోని జీ.ఎర్రబల్లి అంగన్‌వాడీ కేంద్రంలో ఖాళీగా ఉన్న ఆయా పోస్టుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జయమ్మ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 21 నుంచి 35 ఏళ్లలోపు వయస్సు ఉండి, అదే గ్రామానికి చెందిన వారు దరఖాస్తు చేసుకునేందుకు అర్హులన్నారు. అర్హులైన అభ్యర్థులు తమ దరఖాస్తులను ఈనెల 29 లోపు అందజేయాలని సూచించారు. మరింత సమాచారం కోసం నల్లచెరువులోని ప్రాజెక్టు కార్యాలయంలో సంప్రదించాలని పేర్కొన్నారు.

రాయితీలు సద్వినియోగం చేసుకోండి


మాట్లాడుతున్న పట్టుపరిశ్రమ శాఖ డివిజనల్ అధికారిణి గీత

గాండ్లపెంట: పట్టు రైతులకు అందించే రాయితీలను సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా ఎదగాలని పట్టుపరిశ్రమ శాఖ డివిజనల్ అధికారిణి గీత సూచించారు. గురువారం మునగలవారిపల్లిలో రైతు విశ్వనాథరెడ్డి మల్బరి షెడ్డులో డాక్టర్ వైఎస్సార్ పట్టుబడి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మల్బరీ తోటల పెంపకంలో రైతులు సస్యరక్షణ, చీడపీడల నివారణపై జాగ్రత్తలు పాటించాలన్నారు. పట్టు పురుగుల పెంపకం చేపట్టే రైతులు వాతావరణానికి అనుకూలంగా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పట్టు పురుగులకు సోకే వ్యాధులు, వాటి నివారణకు సూచనలు, సలహాలు తెలిపారు. అనంతరం ఆర్థిక అక్షరాస్యతపై బ్యాంకు కౌన్సిలర్లు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పట్టుపరిశ్రమ శాఖ అధికారి రామకృష్ణ, మండల మల్బరీ అధికారి ఇమాంసాబ్, వీరమారుతి, నాగప్ప, సోమయాజుపల్లి, కత్తివారిపల్లి, వేపరాల గ్రామాల రైతులు పాల్గొన్నారు.